E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో


పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం :

9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD సంపుటి :01 సంచిక :215 బుధవారం 15 జూలై 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

## ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం




2 లో

- జూలై 24 వరకు సవరణలకు అవకాశం
- రాజకీయ పార్టీల విజ్ఞప్తికి ఈసీ స్పందన
- ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీలో జాప్యం
- ఓటర్ల నమోదు ప్రక్రియకు అదనపు సమయం
- ఓటు హక్కు కోల్పోకుండా ఈసీ కీలక నిర్ణయం

## క్షేత్రస్థాయి పర్యటనలతోనే వాస్తవాలు : సీఎం చంద్రబాబు




న్యూస్ డెస్క్, 14 జూలై (తెలుగు గళం): ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తేనే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని, అందుకోసమే మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌వోడీల పర్యటనలకు ప్రత్యేక షెడ్యూల్ ఇచ్చామని స్పష్టం చేశారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంగా వివిధ శాఖల అధిపతులు, కార్యదర్శులతో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

2 లో

## పహల్గామ్ దాడి కేసులో కీలక పరిణామం

- హాఫీజ్ సయీద్‌కు ఎన్‌బీడబ్ల్యూ
- ఎన్ఐఏ కోర్టు కీలక ఆదేశాలు
- అనుబంధ ఛార్జ్‌షీట్‌లో ప్రధాన నిందితుడు
- లష్కరే తోయిబాపై ఉచ్చు బిగింపు
- రాకపోయినా ట్రయల్ కొనసాగుతుంది
- 'ట్రయల్ ఇన్ అబ్సెన్షియా'తో విచారణ

2 లో

## మత్స్యకారుల కుటుంబాలకు వైఎస్ జగన్ పరామర్శ!

- ప్రభుత్వంపై జగన్ విమర్శలు
- నిర్లక్ష్యమే ప్రాణనష్టానికి కారణం
- రూ. కోటి ఎక్స్‌గ్రేషియా డిమాండ్
- అధికారుల తీరుపై ఆగ్రహం
- సూపర్ సిక్స్ హామీలపై ప్రశ్నలు
- బాధితులకు అండగా ఉంటామన్న జగన్



2 లో

## రేవంత్‌పై ఈటల ఘాటు విమర్శలు

- బ్యారేజీల్లో నీటి నిల్వల సూచన
- రైతుల ఆందోళనపై ఆవేదన
- 'ఖిలాడీ' వ్యాఖ్యలకు కౌంటర్



2 లో

న్యూస్ డెస్క్, 14 జూలై (తెలుగు గళం): సీఎం రేవంత్ రెడ్డి చేసిన విమర్శలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఘాటుగా స్పందించారు. రేవంత్ రెడ్డి నీచమైన బాషను పక్కనపెట్టి సాగునీరు, తాగు నీరు అందించే చర్యలు తీసుకోవాలని అన్నారు. సుందిళ్ళ, అన్నారం బ్యారేజీలకు 2024లోనే మరమ్మత్తులు చేసినట్టు ఎన్డీఎస్ఏ రిపోర్ట్ చెబుతోందని అన్నారు. ఇది చెబుతోందని ఎన్డీఎస్ఏనే కాబట్టి వెంటనే సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో నీళ్లు స్టోరేజీ పెట్టుకోవాలని సూచించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ట్విస్ట్

### ఏబీ వెంకటేశ్వరరావు వాంగ్మూలం నమోదు

- ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త మలుపు
- కాల్ డేటా రికార్డులపై సిట్ ఫోకస్
- ఇతర రాష్ట్ర మాజీ ఐపీఎస్‌కు సిట్ నోటీసు
- తుది చార్జ్‌షీట్‌కు సిట్ కసరత్తు
- దర్యాప్తులో సంచలన అంశాలు వెలుగులోకి?

2 లో

# బోనాల జాతరకు సర్వం సిద్ధం

- గోల్కొండలో అమ్మవారి వైభవం
- 16 నుంచి బోనాల సందడి
- అమ్మవారికి తొలి బోనం
- భక్తులతో కిక్కిరిసే గోల్కొండ
- నజర్ బోనాల ఘన సమర్పణ
- డప్పుల మోతతో ఊరేగింపు
- పోతరాజుల విన్యాసాల సందడి
- విస్తృత ఏర్పాట్లు పూర్తి
- ఆధ్యాత్మిక శోభలో భాగ్యనగరం



న్యూస్ డెస్క్, 14 జూలై (తెలుగు గళం): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే చారిత్రాత్మక ఆషాఢ మాస బోనాల జాతరకు గోల్కొండ కోట సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. భాగ్యనగరంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ బోనాల ఉత్సవాలు ఈ నెల 16న అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. నెల రోజుల పాటు ఆధ్యాత్మిక వాతావరణంలో సాగే ఈ జాతరకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాదిగా తరలివచ్చే భక్తుల కోసం అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు .

9 రోజుల పాటు ప్రత్యేక పూజలు..

గోల్కొండ కోటపై కొలువుదీరిన శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారికి ఈ నెల 16న నిర్వహించే తొలి బోనంతో ఉత్సవాలు మొదలై, ఆగస్టు 13న ముగియనున్నాయి. ఈ జాతరలో భాగంగా అమ్మవారికి తొమ్మిది రోజుల పాటు తొమ్మిది రకాల ప్రత్యేక పూజలు నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీ. మొదటి పూజ: 16వ తేదీ (గురువారం) – ఉత్సవాల ప్రారంభం. రెండో పూజ: 19వ తేదీ (ఆదివారం), మూడో పూజ: 23వ తేదీ (గురువారం), నాలుగో పూజ: 26వ తేదీ (ఆదివారం), ఐదో పూజ: 30వ తేదీ (గురువారం) ఉదయం 10.30 గంటలకు చండీహోమం జరుపుతారు. ఆరో పూజ: 02వ తేదీ (ఆదివారం), ఏడో పూజ: 06వ తేదీ (గురువారం) – సాయంత్రం 5 గంటలకు అమ్మవారి పల్లకీ సేవ తీస్తారు. ఎనిమిదో పూజ: 09వ తేదీ (ఆదివారం), తొమ్మిదో పూజ: ఆగస్టు 13వ తేదీ (గురువారం) – అమ్మవారి సమారోహణ కుంభహారతితో ఉత్సవాలు ముగుస్తాయి.

మిగతాది 2 లో..

## కేసీఆర్‌పై కిషన్ రెడ్డి విమర్శలు


- 'సింగరేణిని జేబు సంస్థగా మార్చారు'
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై విమర్శలు
- అప్పులతో సింగరేణి కుదేలు
- కోల్ బ్లాక్‌లను పట్టించుకోలేదని ఆరోపణ
- తాడిచర్ల-2తో లాభాలే: కిషన్ రెడ్డి




2 లో

న్యూస్ డెస్క్, 14 జూలై (తెలుగు గళం): బీఆర్ఎస్ హయాంలో.. సింగరేణిని అప్పటి సీఎం కేసీఆర్ తన జేబు సంస్థగా మార్చుకున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. భూపాలపల్లిలో బీజేపీ చేపట్టిన సింగరేణి భరోసా యాత్ర రెండోరోజు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో సింగరేణి 15 సంవత్సరాలు వెనుకబడిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలనలో కూడా సింగరేణిలో అదే పరిస్థితి నెలకొందని, ప్రస్తుతం సంస్థకు లాభాలు లేక కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. సింగరేణి అభివృద్ధిపై కేసీఆర్ ఏనాడూ కేంద్రాన్ని సంప్రదించలేదన్నారు. సింగరేణి వాళ్ల తాత జాగీరు అన్న చందంగా గత, ప్రస్తుత ప్రభుత్వాలు వ్యవహరించాయని ఆరోపించారు.

## ట్రంప్ టార్గెట్ "పికియాక్స్ పర్వతం"



2 లో

- భూగర్భంలో అభేద్యమైన అణు కేంద్రం
- ఇరాన్ రహస్య అణు స్థావరంపై అమెరికా కన్ను
- అణ్వాయుధ అనుమానాలతో ఉద్రిక్తత

## కడియం-సురేఖ వార్

- అధిష్టానం వద్దకు వివాదం
- మీనాక్షిని కలిసిన సురేఖ
- నాలుగు పేజీల ఫిర్యాదు
- కడియంపై తీవ్ర అభ్యంతరం



2 లో

న్యూస్ డెస్క్, 14 జూలై (తెలుగు గళం): తెలంగాణ కాంగ్రెస్‌లో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వర్సెస్ మంత్రి కొండా సురేఖ మధ్య విభేదాలు చివరకు పార్టీ అధిష్టానం వద్దకు చేరాయి. ఈ ఇద్దరు నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా విభేదాలు కొనసాగుతున్న వేళ ఏఐసీసీ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్‌తో మంత్రి కొండా సురేఖ హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. తాజాగా ఆమెను కలిసిన మంత్రి కొండా సురేఖ, కడియం శ్రీహరి తీరుపై నాలుగు పేజీల ఫిర్యాదు లేఖనుం అందజేశారు.

ఆత్మగౌరవం దెబ్బతీస్తున్నారని ఆవేదన:

నాక్షి నటరాజన్‌తో జరిగిన భేటీలో కొండా సురేఖ తన అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు సమాచారం.కడియం శ్రీహరి వ్యవహారశైలిపై సుమారు నాలుగు పేజీల ఫిర్యాదు లేఖను మీనాక్షి నటరాజన్ కు అందజేసిన కొండా సురేఖ

## భారీ వరదలు



2 లో

- 54 మంది మృతి.. తీవ్ర విషాదం
- రోహింగ్యా శిబిరాల్లో బీభత్సం
- కొండచరియలతో భారీ నష్టం
- 10 లక్షల మంది వరదలో చిక్కుకున్నారు
- ఆశ్రయ కేంద్రాలకు బాధితుల తరలింపు
- యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు

తెలుగు గళం
సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

బుధవారం,
15 జూలై 2026



# ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం

**న్యూస్ డెస్క్, 14 జూలై (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్ ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ గడువును పొడిగిస్తూ ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. షెడ్యూల్ ప్రకారం ఈ ప్రక్రియ నేటితో (జులై 14) ముగియాల్సి ఉండగా, రాజకీయ పార్టీల విజ్ఞప్తులు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ గడువును జులై 24వ తేదీ వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ ఇంకా పూర్తి కాకపోవడంతో ఈ గడువు పొడిగింపు నిర్ణయం తీసుకున్నారు.

ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీలో ఆలస్యం..

పలు ప్రాంతాల్లో ఓటర్లకు ఇంకా ఎన్యుమరేషన్ ఫారాలు అందకపోవడం, కొన్ని చోట్ల ఓటర్లు ఫారాలు పూర్తి చేసి సిద్ధంగా ఉంచినా, బూత్ లెవెల్ అధికారులు వాటిని తిరిగి సేకరించడంలో ఆలస్యం చేయడం, ఓటర్ల నుంచి సేకరించిన వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేసే (డిజిటలైజేషన్) ప్రక్రియ ఇంకా పూర్తికాకపోవడం, ఈ సాంకేతిక, పరిపాలనాపరమైన ఇబ్బందుల వల్ల అర్హులైన అనేకమంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని వివిధ రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. తక్షణమే స్పందించి ఎస్ఐఆర్ ప్రక్రియ గడువును పొడిగించాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశాయి. పార్టీలు విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన ఈసీ, ఓటర్ల నమోదు, సవరణలు సజావుగా సాగేందుకు వీలుగా మరో పది రోజుల పాటు సమయాన్ని పొడిగించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం, ఓటర్లు జులై 24వ తేదీ లోపు తమ వివరాల సవరణలు, కొత్త నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు.

# పహల్గామ్ దాడి కేసులో కీలక పరిణామం



**న్యూస్ డెస్క్, 14 జూలై (తెలుగు గళం):** భారత దేశంలో తీవ్ర విషాదం నింపిన పహెల్గాం ఉగ్రదాడి కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న నిషేధిత ఉగ్రవాద సంస్థ 'లష్కరే తోయిబా' అధినేత హాఫీజ్ సయీద్‌కు ఎన్ఐఏ కోర్టు నాన్–బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ) జారీ చేసింది. పహల్గామ్ ఉగ్రదాడి కేసులో హాఫీజ్ సయీద్‌పై ఎన్ఐఏ జూలై 6న అనుబంధ ఛార్జ్‌షీట్ దాఖలు చేయగా.. ఆ తర్వాత రెండు రోజులకు, అంటే జూలై 8న ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఈ వారెంట్ జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత ఏడాది ఏప్రిల్ 22న దక్షిణ కాశ్మీర్‌లోని పర్యాటక ప్రాంతమైన పహల్గాంలో ఉగ్రవాదులు ఘాతుకానికి పాల్పడ్డారు. ఈ కాల్పుల్లో పర్యాటకులతో సహా మొత్తం 26 మంది ప్రాణాలు కోల్పోయారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఉగ్రదాడి వెనుక లష్కరే తోయిబా కుట్ర ఉన్నట్లు ఎన్ఐఏ గుర్తించి విచారణను ముమ్మరం చేసింది.

అనుబంధ ఛార్జ్‌షీట్‌లో కీలక నిందితుడిగా..

భారత్, అమెరికా దేశాలచే అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించబడిన 76 ఏళ్ల హాఫీజ్ సయీద్‌పై జమ్మూలోని ప్రత్యేక ఎన్ఐఏ కోర్టులో ఈ అనుబంధ ఛార్జ్‌షీట్ దాఖలైంది. లష్కరే తోయిబా అధినేతగా, అలాగే దానికి ప్రాక్సీగా వ్యవహరిస్తున్న 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' రూపకర్తగా సయీద్‌పై కేసులు నమోదయ్యాయి. సయీద్ పై ఉపా చట్టంతో పాటు బిఎన్ఎస్ 2023 చట్టంలోని పలు సెక్షన్ల కింద కఠినమైన సెక్షన్లను ఛార్జ్‌షీట్‌లో చేర్చారు. నింధితుడిపై మోపిన అభియోగాలకు తగిన ఆధారాలు ఉన్నాయని భావించిన న్యాయస్థానం ఈ కేసును విచారణకు స్వీకరించి నిందితుడిపై నాన్ బెయిలబుల్ వారెంట్ ను జారీ చేసింది.

ట్రయల్స్ కు రాకపోయినా విచారణ:

పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్ సర్గోధా నివాసి అయిన హాఫీజ్ సయీద్ పహల్గామ్ ఉగ్రదాడి కేసులో ప్రధాన నిందితుడని, అతను కావాలనే అరెస్టు కాకుండా తప్పించుకు తిరుగుతున్నాడని ఎన్ఐఏ కోర్టుకు తెలిపింది. ఈ కేసులో నిష్పక్షపాతంగా, సమగ్రంగా, సమర్థవంతంగా దర్యాప్తు ముగించాలంటే నిందితుడైన హాఫీజ్ సయీద్‌ను అరెస్ట్ చేయడం, కస్టడీలోకి తీసుకుని విచారించడం అత్యవసరం. అందువల్ల అతనిపై నాన్–బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తున్నామని కోర్టు స్పష్టం చేసింది. అయితే సయీద్ ఇండియాకు రాకపోయినప్పటికీ విచారణ కొనసాగనుంది. 2024లో అమల్లోకి వచ్చిన కొత్త క్రిమినల్ చట్టం 'భారతీయ నాగరిక్ సురక్ష సంహిత– 2023'లోని సెక్షన్ 356 ప్రకారం నిందితుడు అందుబాటులో లేకపోయినా అతనిపై విచారణ జరిపి శిక్ష వేయవచ్చు. దీన్నే 'ట్రయల్ ఇన్ అబ్సెన్షియా' అంటారు.

# కేసీఆర్‌పై కిషన్ రెడ్డి విమర్శలు

మొదటి పేజీ తరువాయి

సింగరేణి పేరుతో బీఆర్ఎస్ నేతలు వేలకోట్ల రూపాయలను దోచుకున్నారన్నారు. సింగరేణి నిధులను ఆ ప్రాంతంలోనే ఖర్చు చేయకుండా.. కేసీఆర్ కుటుంబ సభ్యుల నియోజకవర్గాల్లో ఖర్చు చేశారని, గతంలో కేంద్రం మనకు కోల్ బ్లాక్ లు ఇచ్చినా కేసీఆర్ పట్టించుకోలేదన్నారు.

కేసీఆర్ పాలనలో జెన్ కో కు రూ. 8,958 కోట్ల అప్పు ఉంటే.. రేవంత్ పాలనలో అది రూ. 26,875 కోట్లకు చేరిందన్నారు. ఇప్పుడు అప్పుకోసం సీఎం రేవంత్ తమను బెదిరించే స్థాయికి వచ్చారన్నారు. సింగరేణిలో నాణ్యమైన బొగ్గు లేదని చెప్తున్నారని, ఇది చాలా ప్రమాదకరమైన విషయంగా పరిగణించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. తాడిచర్ల–2 ద్వారా సింగరేణికి చాలా లాభం చేకూరుతుందని స్పష్టం చేశారు.

# బోనాల జాతరకు సర్వం సిద్ధం

మొదటి పేజీ తరువాయి

భక్తులు తమ మొక్కులు చెల్లించుకోవడానికి భారీగా తరలివచ్చే అవకాశం ఉండడంతో, క్యూలైన్లు, తాగునీరు, పారిశుధ్యం తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

తొలి బోనం, పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రులు..

నగరంలో ఎక్కడ బోనాలు ప్రారంభమైనా తొలి బోనం గోల్కొండ జగదాంబ మహంకాళి అమ్మవార్లకే సమర్పించడం ఇక్కడి విశిష్టత. 28 కులవృత్తుల ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా రెండు పచ్చి మట్టి కుండల్లో నజర్ బోనాలను తయారు చేస్తారు. వీటిలో ఒక బోనాన్ని జగదాంబ అమ్మవారికి, మరొకటి మహంకాళి అమ్మవారికి సమర్పిస్తారు. ఉత్సవాల ప్రారంభం రోజున లంగర్ హౌస్ చౌరస్తా వద్ద దేవాదాయ శాఖ తరపున ఏర్పాటు చేసే భారీ తొట్టెలకు రాష్ట్ర మంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు.

శివసత్తుల పూనకాలు.. పోతరాజుల విన్యాసాలు..

లంగర్ హౌస్ నుంచి ప్రారంభమయ్యే ఈ భారీ తొట్టెల ఊరేగింపు భక్తుల కోలాహలం మధ్య సాగనుంది. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, స్థానిక కళాకారుల ఆటపాటలు, డప్పు వాయిద్యాల మోతతో బడా బజార్, రిసాల బజార్ మీదుగా ఊరేగింపు కోటపైకి చేరుకుంటుంది. అనంతరం అమ్మవార్లకు నజర్ బోనాలు, పట్టు వస్త్రాలను భక్తిశ్రద్ధలతో సమర్పించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తోంది.

వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు..

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు శ్రీ జగదాంబ మహంకాళి దేవాలయ బోనాల ఉత్సవాల కమిటీ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్ తెలిపారు. చారిత్రాత్మక గోల్కొండ కోట నుంచే ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు ప్రారంభం కావడం ఆనవాయితీగా వస్తోందని ఆయన గుర్తుచేశారు.

ఈ నెల 16వ తేదీన ప్రారంభం కానున్న గోల్కొండ బోనాల ఉత్సవాల్లో రాష్ట్ర మంత్రులు పాల్గొని, భారీ తొట్టెలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని వెల్లడించారు. అమ్మవార్లకు నజర్ బోనాలు, పట్టు వస్త్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, అమ్మవారి ఆశీర్వాదాలు తీసుకోవాలని ఆకుల చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో ట్విస్ట్



**న్యూస్ డెస్క్, 14 జూలై (తెలుగు గళం):** తెలంగాణ రాజకీయాలను షేక్ చేసిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. తాజాగా ఈ కేసులో ఏపీ రిటైర్డ్ ఐపీఎస్ స్టేట్‌మెంట్ ను సిట్ అధికారులు రికార్డ్ చేశారు. తాజాగా రిటైర్డ్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు వాంగ్మూలాన్ని అధికారులు నమోదు చేశారు. గతంలో ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఏబి వెంకటేశ్వరరావు పని చేశారు. అయితే 2023లో వెంకటేశ్వరరావు కాల్ డేటా రికార్డింగ్స్ ను నిందితులు తీసినట్టు సిట్ అధికారులు గుర్తించారు. దీంతో విట్ నెస్ కింద వెంకటేశ్వరరావు స్టేట్ మెంట్ రికార్డు చేశారు. అయితే ఈ కేసులో ఇతర రాష్ట్రానికి చెందిన బ్యోరోక్రాట్ ను సిట్ అధికారులు విచారించడం ఇదే మొదటిసారికావడం గమనార్హం.

అనుబంధ అభిమోగ పత్రం సిద్ధం!:

ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తును సిట్ ముగింపునకు చేర్చినట్లు తెలుస్తోంది. గత ఐదున్నర నెలలుగా అహర్నిశలు సాగిన విచారణలో సిట్ అధికారులు సంచలన నిజాలను వెలుగులోకి తెచ్చారు. ఈ కుట్రలో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుతో పాటు పలువురు పోలీసు మాజీ అధికారులు, రాజకీయ నేతలపై పక్కా సాక్ష్యాలతో కూడిన తుది చార్జిషీట్ దాఖలు చేసేందుకు కసరత్తు ముమ్మరం చేసినట్లు సమాచారం. ఈ కేసు నిందితుల జాబితాలో ముగ్గురు బీఆర్ఎస్ ముఖ్యుల్ని చేర్చినట్లు గత కొంత కాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పక్క రాష్ట్రానికి చెందిన బ్యూరోక్రాట్ వాంగ్మూలాన్ని నమోదు చేయడంతో ఈ కేసు దర్యాప్తులో ఎలాంటి విషయాలు అంతిమంగా వెలుగులోకి రాబోతున్నాయనేది ఉత్కంఠగా మారింది.

# కడియం-సురేఖ వార్

మొదటి పేజీ తరువాయి

తనకు సమాచారం ఇవ్వకుండా, తన పరిధిలోని దేవాదాయ శాఖపై కడియం శ్రీహరి సమీక్షలు నిర్వహించడం పరిపాలనా వ్యవస్థకు విరుద్ధమని ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇది తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని, తనను కావాలనే ఇబ్బందులకు గురి చేస్తున్నారని సురేఖ ఆవేదన వ్యక్తం తెలుస్తోంది. తన పని తాను చేసుకుంటుంటే, అనవసరంగా వివాదాల్లోకి లాగుతున్నారని, కడియం శ్రీహరి తీరు సరికాదని ఆమె ఇంఛార్జికి వివరించినట్లు తెలుస్తోంది. అయితే కడియం శ్రీహరి విషయాన్ని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ పెద్దలకు ఫిర్యాదు చేసిన మంత్రి.. ఇవాళ మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లారు.

చిన్న విషయాలను పట్టించుకోకండి:

మంత్రి కొండా సురేఖ వాదనలను విన్న మీనాక్షి నటరాజన్.. ఆమెకు పలు సూచనలు చేసినట్లు తెలుస్తోంది. చిన్న చిన్న విషయాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని, రాష్ట్రంలో పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా పని చేయాలని సూచించినట్లు సమాచారం. మీరు ఒక బీసీ లీడర్‌గా పార్టీలో పెద్ద బాధ్యతను కలిగి ఉన్నారని కాబట్టి, వివాదాలకు తావివ్వకుండా, పార్టీని బలోపేతం చేసే దిశగా దృష్టి పెట్టాలని మీనాక్షి స్పష్టం చేసినట్లు తెలిసింది. చాలా కాలంగా ఈ ఇద్దరు నేతల మధ్య విభేదాలు కొనసాగుతుండగా తాజాగా దేవాయాద శాఖపై సమీక్షతో మరోసారి మాటల యుద్ధం అధిష్టానం జోక్యంతోనైనా ఈ 'కౌంటర్–ఎన్‌కౌంటర్' రాజకీయాలకు తెరపడుతుందో లేదో చూడాలి.

# రేవంత్‌పై ఈటల ఘాటు విమర్శలు



**న్యూస్ డెస్క్, 14 జూలై (తెలుగు గళం):** సీఎం రేవంత్ రెడ్డి చేసిన విమర్శలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఘాటుగా స్పందించారు. రేవంత్ రెడ్డి నీచమైన బాషను పక్కనపెట్టి సాగునీరు, తాగు నీరు అందించే చర్యలు తీసుకోవాలని అన్నారు. సుందిళ్ళ, అన్నారం బ్యారేజీలకు 2024లోనే మరమ్మత్తులు చేసినట్టు ఎన్డీఎస్ఏ రిపోర్ట్ చెబుతోందని అన్నారు. ఇది చెబుతోందని ఎన్డీఎస్ఏనే కాబట్టి వెంటనే సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో నీళ్లు స్టోరేజీ పెట్టుకోవాలని సూచించారు. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో పంటలు ఎండిపోతున్నాయని రైతాంగం ఆందోళన చెందుతోందని, తాగు నీళ్లు లేక కూడా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు.

కనీస అవగాహన లేకుండా రేవంత్ రెడ్డి పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. హరీష్ రావు, కేసీఆర్, కేటీఆర్ ఉన్న ఖిలాడీ కమిటీలో ఈటల చేరారు అని రేవంత్ చేసిన వ్యాఖ్యలపై సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖిలాడీ ఈటలనా రేవంత్ రెడ్డా అనేది తెలంగాణ సమాజం నిర్ణయిస్తుందని అన్నారు. రేవంత్ రెడ్డి హెడ్ లైన్స్ కోసం మాట్లాడే వ్యక్తి అని విమర్శించారు. రేవంత్ రెడ్డి కేవలం రాజకీయకోణంలో మాట్లాడతారని, ప్రజల కోణంగా మాట్లాడరని అన్నారు. చిత్తశుద్ధి ఉంటే ఎన్ నినోపై ఇంజనీర్లతో సమావేశమై చర్చించాలని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగితే వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు.

# క్షేత్రస్థాయి పర్యటనలతోనే వాస్తవాలు : సీఎం చంద్రబాబు




**న్యూస్ డెస్క్, 14 జూలై (తెలుగు గళం):** ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తేనే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని, అందుకోసమే మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌వోడీల పర్యటనలకు ప్రత్యేక షెడ్యూల్ ఇచ్చామని స్పష్టం చేశారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంగా వివిధ శాఖల అధిపతులు, కార్యదర్శులతో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

ఏళ్లనాటి సమస్యలకు పరిష్కారం..

'60–70 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న శెట్టిపల్లి భూసమస్యను పరిష్కరించాం. ఈ ప్రాపర్టీ అన్‌లాక్ ద్వారా ప్రభుత్వానికి 90 ఎకరాల భూమి వచ్చింది. వట్టిచెరుకూరులో ఎప్పుడో నిర్మించుకున్న ఇళ్లకు పట్టాలు పంపిణీ చేశాం. ఇలా సమస్యలను విభాగాల వారీగా విడదీసి పరిష్కరించాలి. ఈ ఏడాది రాష్ట్ర జీఎస్‌డీపీ 20.4 శాతంగా నమోదైంది. లక్ష్యాలకు అనుగుణంగా ముందుకెళ్తే 15 శాతం వృద్ధిరేటు సాధించడం సులభమే. స్థిరమైన ఆర్థిక వ్యవస్థకు రాబడులు చాలా కీలకం. అయితే, కీలక విభాగాల్లో కొందరు ప్రతికూల పాత్ర పోషిస్తే ఇబ్బందులు తప్పవు. త్వరలోనే కేపీఐ సూచీల ద్వారా నెలవారీ ఆర్థిక నివేదికలు సిద్ధం చేస్తాం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

సాంకేతికతతో మెరుగైన పాలన..

దేవాదాయ, రోడ్లు–భవనాలు, ఏపీఎస్‌ఆర్టీసీ, రవాణా, అగ్నిమాపక శాఖల పనితీరుతో పాటు, రాష్ట్రంలో యూరియా నిల్వలపై సీఎం ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సాంకేతికతను ఉపయోగించుకుని పాలనను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు.

# ట్రంప్ టార్గెట్ "పికియాక్స్ పర్వతం"

**న్యూస్ డెస్క్, 14 జూలై (తెలుగు గళం):** మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వేళ, ఇరాన్‌లోని అత్యంత రహస్య అణు కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం అంతర్జాతీయంగా తీవ్ర చర్చలకు దారితీస్తోంది. ఇరాన్‌లోని ప్రసిద్ధ నటాంజ్ అణు క్షేత్రం సమీపంలో ఉన్న 'పికియాక్స్ పర్వతం' ఇప్పుడు ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలకు కేంద్ర బిందువుగా మారింది. ఇది ఇరాన్ దేశంలోనే అత్యంత లోతులో, అత్యంత సురక్షితమైన భూగర్భ అణు సైట్‌గా రక్షణ నిపుణులు పేర్కొంటున్నారు.

పర్వతం కింద అభేద్యమైన అణు కోట

ఇరాన్ సైన్యం ఈ పికియాక్స్ పర్వతం కింద ఉన్న కఠినమైన గ్రానైట్ రాళ్లను తొలిచి, భూగర్భంలో సుమారు 100 మీటర్ల కొన్ని చోట్ల ఏకంగా 2,000 అడుగుల లోతున అత్యాధునిక అణు మౌలిక వసతులను నిర్మించింది. ఈ అండర్‌గ్రౌండ్ ల్యాబ్‌లలో యురేనియం ఎన్రిచ్మెంట్ హాల్స్ తో పాటు అణు ఇంధన నిల్వలను భద్రపరిచారు. గతంలో ఇరాన్‌కు రక్షణ కవచంగా భావించిన 'ఫోర్డో' అణు కేంద్రం కంటే ఈ పికాక్స్ సైట్ చాలా లోతుగా, బలంగా, వైమానిక దాడులను తట్టుకునేలా నిర్మించబడింని సమాచారం.

ట్రంప్ ఎందుకు టార్గెట్ చేస్తున్నారు?

ప్రస్తుతం పికియాక్స్ పర్వతం కింద ఉన్న ల్యాబ్‌లలో అణ్వాయుధాల తయారీ యాక్టివ్‌గా లేదని అంతర్జాతీయ నివేదికలు చెబుతున్నప్పటికీ, అమెరికా మాత్రం దీనిని తీవ్రంగా అనుమానిస్తోంది. భవిష్యత్తులో ఇరాన్ ఇక్కడి నుండే అత్యంత రహస్యంగా అణ్వాయుధాలను తయారు చేసే ప్రమాదం ఉందని వైట్ హౌస్ భావిస్తోంది. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధ దేశంగా మారకుండా అడ్డుకోవడమే తమ లక్ష్యమని, అందుకోసం ఈ సైట్‌పై దాడులు చేయడానికి కూడా వెనుకాడబోమని డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు.

బంకర్ బస్టర్లు కూడా పని చేయని వైనం

అమెరికా సైన్యం వద్ద ఉన్న అత్యంత శక్తివంతమైన సాంప్రదాయ బాంబు జిబీయూ–57. 30,000 పౌండ్ల బరువుండే ఈ బంకర్ బస్టర్ బాంబు ఎంతటి భూగర్భ స్థావరాలనైనా చీల్చుకుంటూ వెళ్లగలదు. అయితే, పికాక్స్ పర్వత గ్రానైట్ శిలల పొరలు, అది ఉన్న లోతు దృష్ట్యా, ఈ అత్యాధునిక బంకర్ బస్టర్ కూడా ఆ అణు ల్యాబ్‌లను పూర్తిగా ధ్వంసం చేయలేదని సైనిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ కేంద్రాన్ని నిర్వీర్యం చేయాలంటే అమెరికాకు 'టాక్టికల్ న్యూక్లియర్' లేదా భారీ స్థాయిలో నేలమార్గం ద్వారా సైనిక బలగాలను పంపే 'గ్రౌండ్ ఆపరేషన్' మాత్రమే ప్రత్యామ్నాయాలని విశ్లేషిస్తున్నారు. గతంలో ఇరాన్‌కు చెందిన ఫోర్డో, నటాంజ్ వంటి ప్రాథమిక సైట్లపై సైబర్ దాడులు, అంతర్గత విద్రోహ చర్యలు జరిగినప్పటికీ.. ఈ పికియాక్స్ పర్వతం మాత్రం ఇప్పటివరకు ఎవరికీ చిక్కకుండా సురక్షితంగా ఉంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో, ఈ అణు కోటపై అమెరికా ఎలాంటి అడుగు వేయబోతుందనేది ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది.

# భారీ వరదలు.. 54 మంది మృతి



**న్యూస్ డెస్క్, 14 జూలై (తెలుగు గళం):** బంగ్లాదేశ్ పై ప్రకృతి ప్రకోపించింది. భారీ కుండపోత వర్షాల కారణంగా వరదలు పోటెత్తాయి. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాల ధాటికి కొండచరియలు విరిగిపడటంతో 54 మంది మృతి చెందినట్లు అక్కడి అధికారులు వెల్లడించారు. అధికారిక సమాచారం ప్రకారం.. ఈ ప్రకృతి విపత్తు వల్ల తీరప్రాంత జిల్లా అయిన కాక్స్ బజార్ అత్యంత తీవ్రంగా ప్రభావితమైంది. ఇక్కడ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు ప్రజాజీవనాన్ని పూర్తిగా స్తంభింపజేశాయి.

రోహింగ్యా శరణార్థి శిబిరాలపై విరిగిపడిన కొండచరియలు

కాక్స్ బజార్‌లో ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద రోహింగ్యా శరణార్థి క్యాంపుల్లో పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా మారింది. కొండ ప్రాంతాలలో ఎడతెగని వర్షాల వల్ల మట్టి దిబ్బలు, కొండచరియలు ఒక్కసారిగా విరిగిపడటంతో శరణార్థుల తాత్కాలిక నివాసాలు పూర్తిగా శిథిలమయ్యాయి. మృతుల్లో పెద్దలతో పాటు పిల్లలు కూడా ఉండటం హృదయాలను కలచివేస్తోంది. స్థానిక విపత్తు నిర్వహణ మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. ఒక్క కాక్స్ బజార్‌లోనే 31 మంది మరణించగా, వారిలో 13 మంది రోహింగ్యా శరణార్థులు ఉన్నారు. వీటితో పాటు చిట్టగాంగ్ లో 13 మంది, బందర్‌బన్ లో ఆరుగురు చొప్పున ప్రాణాలు కోల్పోయారు.

ఇళ్ల కప్పుల వరకు చేరిన వరద నీరు

వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రస్తుతం అత్యంత దయనీయ దృశ్యాలు కనిపిస్తున్నాయి. అనేక లోతట్టు గ్రామాల్లో ఇప్పటికీ నడుములోతు నీరు నిలిచి ఉండగా, కొన్ని ప్రాంతాల్లో వరద ఉధృతి ఎంతలా పెరిగిందంటే.. ప్రజల ఇళ్ల పైకప్పులు కూడా మునిగిపోయాయి. వరదల కారణంగా ప్రభావితమైన 7 జిల్లాల్లో దాదాపు 1.55 లక్షల కంటే ఎక్కువ కుటుంబాలు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. విపత్తు నిర్వహణ మంత్రిత్వ శాఖ ధృవీకరించిన సమాచారం ప్రకారం.. మొత్తం ఆగ్నేయ ప్రాంతంలో 10 లక్షల మందికి పైగా ప్రజలు వివిధ ప్రాంతాల్లో చిక్కుకుపోయి సహాయం కోసం ఎదురుచూస్తున్నారు.

యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు

పరిస్థితి తీవ్రతను పరిగణనలోకి తీసుకుని బంగ్లాదేశ్ ప్రభుత్వం, స్థానిక యంత్రాంగం యుద్ధప్రాతిపదికన సహాయక, రెస్క్యూ చర్యలను ప్రారంభించాయి. వరద బాధితులను తరలించేందుకు ప్రభావిత జిల్లాల్లో 1,040 కంటే ఎక్కువ అత్యవసర ఆశ్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఇప్పటికే 38,000 మందికి పైగా ఆశ్రయం పొందుతున్నారు. బాధితులకు తక్షణ సహాయం కింద వేలాది టన్నుల బియ్యం, కోట్ల రూపాయల ఆర్థిక సహాయంతో పాటు పొడి ఆహారం, తాగునీటిని అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించింది. అయితే.. వరద నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటం వల్ల మారుమూల ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు చేరుకోవడానికి రెస్క్యూ టీమ్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి.

# మత్స్యకారుల కుటుంబాలకు వైఎస్ జగన్ పరామర్శ!



**న్యూస్ డెస్క్, 14 జూలై (తెలుగు గళం):** మత్స్యకారులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, కేవలం ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే జులై 4న జరిగిన పడవ ప్రమాదంలో ఆరుగురు మత్స్యకారులు మరణించాలని వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విమర్శించారు. మంగళవారం మధ్యాహ్నం విశాఖపట్నం సమీపంలోని జబ్బర్ తోటలోని బాధిత మత్స్యకార కుటుంబాలను, ప్రమాదం నుంచి బయటపడిన మత్స్యకారుడు చిన్నాను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన జగన్.. కూటమి ప్రభుత్వం విమర్శలు గుప్పించారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నేటికీ నెరవేర్చలేదన్నారు. పడవ ప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. తీరానికి 10 మైళ్ల దూరంలోనే ఘటన జరిగినా.. కేవలం ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే ఆరుగురు మత్స్యకారులు జలసమాధి అయ్యారని, ఫలితంగా వారి కుటుంబాలు పెద్దదిక్కు లేనివి అయ్యాయని తీవ్రంగా దుయ్యబట్టారు. ఫిషరీస్ అధికారులు కూడా దీనిపై వెంటనే స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు.

ఆ రోజురాత్రి 10.30 గంటలకు ప్రమాదంపై కలెక్టర్, మెరైన్ సీఐకి బాధితులు మెసేజ్ పెట్టారని, అప్పుడే స్పందించి ఉంటే కొందరు మత్స్యకారులైనా బ్రతికేవారన్నారు. 5వ తేదీన చైనా బోటు సిబ్బంది చిన్నాను కాపాడటంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడన్నారు. ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే త్రీమెన్ కమిటీ వేశారని, ఆ కమిటీ ఇచ్చిన నివేదికంతా కూడా తప్పులతడకగా ఉందన్నారు. అసలు ఈ ప్రభుత్వానికి మానవత్వం అనేదే లేదని, ఉంటే రూ.10 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకునేది కాదన్నారు. ప్రమాదం జరిగిందని తెలిశాక ఒక్క అధికారి గానీ, ఉత్తరాంధ్ర మంత్రులు గానీ, మత్స్యశాఖ మంత్రి గానీ వచ్చి పరామర్శించిన పాపాన పోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా బాధితులకు రూ.కోటి చొప్పున ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, మత్స్యకార బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ ప్రభుత్వం ఇవ్వకపోతే.. వైసీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన నెలలోపే బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

## రోడ్డు ప్రమాద బాధితుడి కుటుంబానికి కుడా చైర్మన్ పరామర్శ





తెలుగు గళం ఆత్మకూరు / జులై 14

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన హౌజ్ బుజుర్గు గ్రామానికి చెందిన తాళ్లపల్లి రాజేందర్ కుటుంబాన్ని హన్మకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి పరామర్శించారు.రాజేందర్ కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు.వారి దీన స్థితిని అడిగి తెలుసుకున్న ఆయన, ప్రభుత్వ పరంగా ఆ కుటుంబానికి 'ఇందిరమ్మ ఇల్లు' వచ్చేలా అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారికి తోడుంటుందని భరోసా ఇస్తూ, బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సయ్యద్ మౌల, జిల్లా కార్యదర్శి రజినీకార్, రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, ఉపసర్పంచ బోడిగే లక్ష్మి రాంబాబు, సీనియర్ నాయకులు హిమాం, హుస్సేన్, ఖాసీం, డాక్టర్ హుస్సేన్, కరీం సైదోలి, కుమార్, మొగిలి, యాకుబ్, అబ్జాల్, బొబ్బిలి,సాలీమ్, వలి, గ్రామ యూత్ అధ్యక్షులు షరీఫ్ కాంగ్రెస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి గ్రామీణ క్రీడోత్సవం

### జూలై 18, 19 తేదీల్లో జనగామ మినీ స్టేడియంలో వాలీబాల్, త్రోబాల్ పోటీలు

తెలుగు గళం న్యూస్ జనగామ

ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనగామ జిల్లా స్థాయి 18వ గ్రామీణ క్రీడోత్సవాన్ని ఈ నెల 18, 19 తేదీల్లో జనగామలోని ధర్మకంచ మినీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఈషా ఫౌండేషన్ వాలంటీర్ జలజ తెలిపారు.ఈ సందర్భంగా సోమవారం మినీ స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో పోటీల వివరాలను వెల్లడించారు.ఈ క్రీడోత్సవంలో పురుషుల వాలీబాల్ మరియు మహిళల త్రోబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వాలీబాల్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2012 జూలై 12కు ముందు జన్మించి ఉండాలి. త్రోబాల్ పోటీల్లో పాల్గొనే మహిళా జట్టులో ముగ్గురు 13 సంవత్సరాలు నిండినవారు, మిగిలిన ఏడుగురు 21 సంవత్సరాలు నిండినవారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు.గతంలో రాష్ట్ర లేదా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు ఈ పోటీల్లో అవకాశం ఉండదని స్పష్టం చేశారు.విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.10,000, ద్వితీయ బహుమతి రూ.7,000, తృతీయ బహుమతి రూ.5,000, చతుర్థ బహుమతి రూ.3,000 నగదు బహుమతులు ఇవ్వబడతాయని చెప్పారు. అలాగే మొదటి, రెండో స్థానాల్లో నిలిచిన జట్లు హైదరాబాద్‌లో జరిగే డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం పొందుతాయని తెలిపారు.ఈ సమావేశంలో ఈషా ఫౌండేషన్ వాలంటీర్లు జ్యోతి, రవిచందర్, సాయి ప్రణీత్, మొయిన్, సంతోష్తో పాటు జనగామ జిల్లాకు చెందిన వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, వ్యాయామ దర్శకులు పాల్గొన్నారు.పోటీలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం:

9440365510, 9908574755, 7386330794 నంబర్లను సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

## మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

### ముఖ్యమంత్రికి వినతి ఇవ్వబోతే ముందస్తు అరెస్టులు-సర్పంచుల సంఘం ఆగ్రహం

తెలుగు గళం న్యూస్
పర్వతగిరి/జూలై 14



వరంగల్ జిల్లా:పర్వతగిరి:మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి వినతి పత్రం అందజేయడానికి వెళ్తున్న మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారని సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ఆరోపించారు.

పర్వతగిరి మండలంలో జరిగిన సంఘటనలో ప్రస్తుత సోమారం సర్పంచ్ ఏర్పుల శ్రీనివాస్,వడ్లకొండ మాజీ సర్పంచ్,మాజీ సర్పంచుల ఫోరం పర్వతగిరి మండల అధ్యక్షుడు అమడగాని రాజు యాదవ్ తదితరులను పోలీసులు ఇంటింటికి వెళ్లి అడ్డుకున్నారని తెలిపారు.ఈ సందర్భంగా సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ మాజీ సర్పంచుల పదవీకాలం అయిపోయి 31 నెలలు అవుతుందని, ఈ సమయంలో అప్పులు చేసి గ్రామాలను అభివృద్ధి చేశామని, వడ్డీలు చెల్లించలేక అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతోబాధపడుతున్నాయని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా వినతి ఇవ్వడానికి వస్తున్న వారిని అడ్డుకోవడం సరైనది కాదని,వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించి మాజీ సర్పంచులకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.

## చెన్నారం గ్రామం భూ రీ-సర్వేకు పైలెట్ గ్రామంగా ఎంపిక

### అవగాహన సదస్సులో పాల్గొన్న ఏఎంసి చైర్మన్ నరుకుడు వెంకటయ్య



తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట/జూలై 14

వరంగల్ జిల్లా:చెన్నారం వర్ధన్నపేట: తెలంగాణ రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడానికి,భూములకు పూర్తి భద్రత కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టిన సమగ్ర భూ రీ-సర్వే కార్యక్రమంలో భాగంగా వర్ధన్నపేట మండలం చెన్నారం గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేశారు.ఈ మేరకు ఈరోజు చెన్నారం గ్రామంలో వరంగల్ ఆర్డీఓ సుమ ఆధ్వర్యంలో భూముల రీ-సర్వే అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రీ-సర్వే వల్ల భూ యజమానులకు తమ భూములపై స్పష్టమైన హక్కులు లభిస్తాయని, భవిష్యత్తులో ఎలాంటి గొడవలు ఉండవని తెలిపారు.ప్రతి ఒక్క రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ సదస్సులో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్, గ్రామ రెవెన్యూ అధికారులు, రైతులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మొగుళ్ళపల్లి మండలంలో రవాణా శాఖ విస్తృత తనిఖీలు

### రెండు ప్రైవేట్ స్కూల్ వాహనాలు సీజ్ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవు.. ఏఎంవీఐలు ఈ.శ్రీనివాస్, సుందర్‌లాల్ హెచ్చరిక

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి మొగుళ్ళపల్లి

భూపాలపల్లి జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీఓ) బి. శ్రీనివాస్ ఆదేశాల మేరకు మంగళవారం మొగుళ్ళపల్లి మండల కేంద్రంలోని బ్రిడ్జి వద్ద అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు (ఏఎంవీఐ) ఈ. శ్రీనివాస్, సుందర్‌లాల్ తమ సిబ్బందితో కలిసి ముమ్మర వాహన తనిఖీలు నిర్వహించారు.ఇందులో భాగంగా మండలంలోని ప్రైవేట్ పాఠశాలలకు చెందిన స్కూల్ వాహనాలను తనిఖీ చేయగా,సరైన పత్రాలు లేని రెండు (టాటా మ్యాజిక్)మోటార్ క్యాబ్ వాహనాలను అధికారులు సీజ్ చేసి,స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిబంధనలు ఉల్లంఘించిన సదరు విద్యాసంస్థల యాజమాన్యాలపై మోటారు వాహనాల చట్టం (ఎంవి యాక్ట్) కింద కఠినమైన చర్యలు ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. జిల్లాలో ఏ ఒక్క ప్రైవేట్ పాఠశాల లేదా కళాశాల యాజమాన్యం అన్‌ఫిట్ (ఫిట్‌నెస్ లేని) వాహనాలను రోడ్లపైకి తీసుకురావద్దని స్పష్టం చేశారు.ప్రతి వాహనానికి చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికేట్,పొల్యూషన్,ఇన్సూరెన్స్,పక్కా పర్మిట్ పత్రాలు వాహనంలోనే అందుబాటులో ఉండాలన్నారు.విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని, రాబోయే రోజుల్లో కూడా ఈ ఆకస్మిక తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు యాజమాన్యాలపై కేసులు నమోదు చేయడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను స్కూల్ వాహనాల్లో ఎక్కించే ముందు వాహనాల కండిషన్‌ను ఒకసారి గమనించాలని కోరారు.ఈ తనిఖీల్లో వాలిడ్ సర్టిఫికెట్లు లేని ఇతర వాహనాలను కూడా తనిఖీ చేసి జరిమానా విధించి,సరైన పత్రాలు ఉంచుకోవాలని వాహనదారులను ఆదేశించారు.ఈ విస్తృత తనిఖీ డ్రైవ్‌లో రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పోచంపల్లిలో ఈవీ పారిశుధ్య వాహనాల ప్రారంభం



భువనగిరి (నల్లగొండ) (తెలుగు గళం) : యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మున్సిపాలిటీలో పారిశుధ్య సేవలను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో రెండు నూతన ఈవీ పారిశుధ్య వాహనాలను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన పారిశుధ్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని తెలిపారు. పరిశుభ్రమైన పట్టణ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ వాహనాల ద్వారా ఇంటింటికీ చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ మరింత సమర్థవంతంగా జరిగి ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందుతాయని చెప్పారు.

## యువత భవిష్యత్ కోసం కీలక నిర్ణయం

### నేటి నుండి ఐనవోలు గ్రామంలో బెల్ట్ షాపులు పూర్తి నిషేధం అక్రమ మద్యం విక్రయిస్తే 10 వేల జరిమానా, ఇతర కఠిన చర్యలు: సర్పంచ్ గడ్డం రఘువంశీ గౌడ్

తెలుగు గళం న్యూస్ ఐనవోలు/జూలై 14

హన్మకొండ జిల్లా ఐనవోలు:గ్రామంలో శాంతి భద్రతలు కాపాడడం, యువతను చెడు అలవాట్ల నుండి కాపాడడం, ప్రజల ఆరోగ్యం, కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఐనవోలు గ్రామ పంచాయతీ పాలక మండలి చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది.

నేటి నుండి గ్రామ పరిధిలో బెల్ట్ షాపులను పూర్తిగా నిషేధిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ గడ్డం రఘువంశీ గౌడ్ ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొంత కాలంగా బెల్ట్ షాపుల వల్ల గ్రామ యువత మద్యానికి బానిస అవుతుందని,దీని వల్ల కుటుంబాలలో గొడవలు,ఆర్థిక ఇబ్బందులు,సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పెద్దలు,మహిళలు, యువకులు అందరి విజ్ఞప్తి మేరకు గ్రామ పంచాయతీ ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు.గ్రామ పంచాయతీ తీసుకున్న కీలక నిర్ణయాలు:జూలై 14వ తేదీ రాత్రి 12 గంటల వరకు బెల్ట్ షాపులు నిర్వహించే వారు తమ వద్ద ఉన్న స్టాక్ ను పూర్తి చేయాలి.



నేటి నుండి గ్రామ పరిధిలో ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే పట్టుకున్న వెంటనే 10 వేల రూపాయల జరిమానా విధిస్తారు.

నిబంధనలు ఉల్లంఘించిన వారి రేషన్ కార్డు రద్దు,ఇంటి కరెంటు కట్, చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గ్రామంలో ఎవరైనా అక్రమ మద్యం విక్రయాల గురించి తెలిస్తే వెంటనే గ్రామ పంచాయతీకి లేదా సర్పంచ్ కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మన గ్రామాన్ని మద్యం రహిత,ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం.ఈ నిర్ణయం అమలులో ప్రతి ఒక్కరూ సహకరించాలి.యువత చదువుకొని,మంచి ఉద్యోగాలు చేసి గ్రామానికి పేరు తేవాలి అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సభ్యులు,గ్రామ పెద్దలు,యువకులు,మహిళలు పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు.

## ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిని 1000 పడకలు పెంచాలి

### ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయాలి - సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు నున్నా నాగేశ్వరావు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్యలపై సిపిఎం సర్వే...





తెలుగు గళం న్యూస్, ఖమ్మం పట్టణం / జూలై 15, ఖమ్మం జిల్లా : సమస్యల వలయంలో ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధానాస్పత్రి కొటమిట్లాడుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు నున్నా నాగేశ్వరావు ఆరోపించారు. మంగళవారం

సిపిఎం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రి లో సిపిఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు .ఈ సర్వేలో అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి . ఈ సర్వేలో సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాకి ఒకే ఒక ఆసుపత్రి ప్రభుత్వ ఆసుపత్రి ఉందని ,ఈ ప్రభుత్వ ఆసుపత్రికి జిల్లా నుండి కాకుండా ఆంధ్రప్రదేశ్, చత్తీస్గడ్, తెలంగాణ నుండి వేల సంఖ్యలో వైద్యం చేయించుకోవడానికి రోగులు వస్తున్నారని, వైద్య సదుపాయాలు సరిగా లేవని అన్నారు. ఓపీలో నిలబడి చీటీ రాయించుకోవాలని, చీటీ రాయించుకోవడానికి లైన్లో సరిపోక జనం కిక్కిరిసిపోతున్నారని అన్నారు . వెంటనే ఒపీ సెంటర్ ని పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మందుల తీసుకునే కౌంటర్ దగ్గర కూడా జనాలు చాలామంది నిలబడి ఉంటున్నారని, మందులు కౌంటర్ ను కూడా మరొకటి పెంచాలని అన్నారు. 575 పడకల ఉన్న ఈ ఆసుపత్రిని వేయి పడకలుగా పెంచి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా మార్చాలన్నారు. అంతేకాకుండా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ తగ్గట్టుగా కాంట్రాక్ట్ డాక్టర్లు కాకుండా రెగ్యులర్ డాక్టర్లను నియమించాలన్నారు. అంతేకాకుండా మాతా శిశు సంరక్షణ కేంద్రంలో గైనకాలజిస్ట కొరత తీవ్రంగా ఉందని, వెంటనే డాక్టర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి భవన నిర్మాణాల కోసం 300 కోట్లు మంజూరు చేయాలని అన్నారు. ఇప్పటికే నిర్మించిన కొత్త భవనాన్ని వెంటనే ప్రారంభించాలన్నారు. ఇప్పుడు ఉన్న పాత ఆస్పత్రిలోనే ఓపీలను సౌకర్యవంతమైన విధిగా మార్చడానికి ఇప్పటికే సుమారు 20 కోట్లు మంజూరు అయి ఉన్నాయని, అంతేకాకుండా పాత ఆస్పత్రిని రికన్సెప్ట్ చేసి రోగులకు ఇబ్బంది కలగకుండా సౌకర్యవంతంగా నిర్మించాలన్నారు. ఇప్పటికే 6 కోట్లకు మంజూరైన ఎమ్మారై ని ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా కోట్లాది రూపాయల ఖర్చుపెట్టి మూలన పడేసిన స్కానింగ్ సెంటర్ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎమ్మారై, స్కానింగ్ లేకపోవడం వల్ల నిరుపేదలు పరీక్షలు చేయించుకోవాలంటే వేల రూపాయల ఖర్చు అవుతున్నాయని దీంతో పేదలు ఎవరి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వాటికి మరమ్మత్తులు చేసి ఉపయెయాగంలోకి తేవాలని కోరారు. ఆస్పత్రిలో రెగ్యులర్ గుండె సంబంధిత వ్యాధి వైద్యులు లేరని, వెంటనే రెగ్యులర్ డాక్టర్ను నియమించాలని అన్నారు. ఆస్పత్రిలో సిబ్బంది కూడా తగినంత మంది లేరని అన్నారు. శానిటేషన్ , పారిశుద్ధ కార్మికులు తగినంత మంది లేరని, తగినంత మందిని పెంచాలని అన్నారు. ఉన్న వారికి కూడా మూడు నెలలు ఆరు నెలలు పాటు జీతాలు సరిగా ఇవ్వకపోవడంతో వారు మధ్య మధ్యలో సమ్మెలు చేస్తుండడంతో పారిశుద్ధ సమస్య తీవ్రమవుతుందన్నారు. కార్మికులను కూడా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా సదరన్ క్యాంపు లో కూడా సౌకర్యాలు లేకపోవడంతో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా క్యాంపులు కూడా పెంచాలని కోరారు. అలాగే కాళ్లు విరిగిన చేతులు విరిగిన ఆర్థోపెడిక్ సంబంధించి ఎక్స్ రేలు తీసి వెంటనే ఇవ్వాలని , ఎక్రే దగ్గర కనీసం మూడు నాలుగు గంటలు పడుతుందని, దీనివల్ల ప్రజలకి ఇబ్బంది అవుతుందని, రోగులకు ఆలస్యం కాకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు అలాగే రక్త పరీక్షలు దగ్గర కూడా చాలా ఆలస్యం అవుతుందని ,పరీక్షలు కూడా సుమారు మూడు నాలుగు గంటలు పడుతుందని రిపోర్టు త్వరగా వచ్చే విధంగా చూడాలన్నారు . ఆసుపత్రిలో రోగులందరికీ నాణ్యమైన భోజనాన్ని పెట్టాలని, వారానికి ఒకసారి నాన్ వెజ్ కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రోగులకు మందులన్నీ ప్రభుత్వ ఆసుపత్రిలోని ఇవ్వాలని డిమాండ్ చేశారు.




కొంతమందికి ఈ మందులు దొరకవు బయట తెచ్చుకోండి అని చెప్పి చిట్టీలు రాస్తున్నారని ఆరోపించారు .అన్ని జబ్బులకు మందులు ఆసుపత్రిలోని ఇవ్వాలని ఆయన అన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ నరేందర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, నాయకులు యర్రా శ్రీనువాసురావు, బండారు రమేష్, ఎంఏ జాబ్బర్, ఎస్కే మీరా సాహిబ్, టి విష్ణు, పి రమ్య, మెరుగు రమణా, ప్రవీణ్, మధు, ఎస్కే నాగులు మీరా, బోడపట్ల సుదర్శన్, వజేనేపల్లి శ్రీనువాసురావు, పి నాగసులోచన, ఎస్కే ఇమామ్, అమరావతి, కూరపాటి శ్రీను , బాగం అజితా, రాజు, సదానందం, కుటుంబరావు, పోతురాజు వెంకట్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# పలు గ్రామాల్లో ప్రత్యేక సవరణ నమోదు ప్రక్రియలో పాల్గొన్న మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు

## ప్రక్రియ పారదర్శకంగా జరగాలి: ఇస్లావత్ సావిత్రి





**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/జూలై 14**


వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలం చౌటపల్లి, కొంకపాక, గోపనపల్లి, అనంతారం గ్రామాలలో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ నమోదు ప్రక్రియలో మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచులు వెంకటేశ్వర రావు,విజయ అశోక్ తో కలిసి గ్రామాల్లో పర్యటించి ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పించారు. ఇస్లావత్ సావిత్రి మాట్లాడుతూ ప్రత్యేక సవరణ నమోదు ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీకి చెందిన బూత్ స్థాయి అధికారులను భాగస్వామ్యం చేయాలని,ప్రక్రియ పారదర్శకంగా కొనసాగేలా చూడాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే ప్రమాదమని సర్పంచులకు, గ్రామ అధ్యక్షులకు,పార్టీ బూత్ స్థాయి అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు వెంకటేశ్వర రావు మొదటిసారి గ్రామానికి వచ్చిన మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బోట్ల మహేంద్ర, అనంతారం గ్రామ పార్టీ అధ్యక్షుడు రాజు, పార్టీ బూత్ స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట

## :భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

## రేగొండ రైతు వేదికలో ఉమ్మడి రేగొండ మండలానికి సంబంధించిన కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ







**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**

రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని భూపాలపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు స్పష్టం చేశారు. మంగళవారం రేగొండ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రేగొండ,కొత్తపల్లి గోరి మండలాలకు చెందిన మొత్తం 43 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఇందులో రేగొండ మండలానికి చెందిన 32 మంది,కొత్తపల్లి గోరి మండలానికి చెందిన 11 మంది లబ్ధిదారులు చెక్కులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. ఎన్నికల వేళ ఇచ్చిన హామీల ప్రకారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, పేదలకు సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. కేవలం సంక్షేమ పథకాలే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. గ్రామాల్లో సమగ్ర భూ సర్వేలు నిర్వహించి, హద్దుల నిర్ధారణ పూర్తి చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ త్వరలోనే పట్టాలు అందజేసే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ చెక్కుల పంపిణీ మహోత్సవంలో భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కృష్ణయ్య,పీఏసీఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు, భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ నాయకులు మేకల బిక్షపతి,ఏనుగు రవీందర్ రెడ్డి,రేగొండ సర్పంచ్ వారణాసి మౌనిక అంజి,స్థానిక తహసీల్దార్ శ్వేతా రావు,కొత్తపల్లి గోరి తహసీల్దార్ హేమ, మాజీ ఎంపీపీ పున్నం లక్ష్మీ రవి, వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు,లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేగొండ వారాహి దేవి ఆలయంలో రేపటి నుండి ఆషాఢ పక్షోత్సవాలు



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**

మండల కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీశ్రీ శ్వేత లక్ష్మి వారాహి దేవి ఆలయంలో ఆషాఢ పక్షోత్సవ పూజ మహోత్సవాలు బుధవారం (జూలై 15) నుండి ప్రారంభం కానున్నట్లు ఆలయ పూజారి దాసరి వేణుగోపాల్ తెలిపారు. జూలై 15 నుండి 29 వరకు 15 రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఈనెల 15న కలశస్థాపన,ధ్వజారోహణం,అమ్మవారికి ప్రత్యేక అభిషేక అలంకరణలతో దీక్షలు ప్రారంభమవుతాయి. ప్రతిరోజు ఉదయం అర్చన, సహస్రనామ అర్చన, కుంకుమార్చన, వస్త్ర సేవ, ఒడిబియ్యం సమర్పణ పూజలు.. సాయంత్రం వారాహి హోమం, రాత్రి కాల పూజలు నిర్వహిస్తారు. వీటితో పాటు సందర్భానుసారంగా చండీ హోమం, నవగ్రహ హోమాలు జరగనున్నాయి. ఆఖరి రోజైన జూలై 29న అమ్మవారికి శాకాంబరి అలంకరణ, హోమ పూర్ణాహుతి, మహా నివేదన, గురు పూజోత్సవంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ కోరింది. వివరాలకు 9849528980 నంబర్‌లో సంప్రదించవచ్చు.

# ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో మొదటి, రెండో దశ ఇందిరమ్మ ఇండ్ల ప్రగతి, అర్హుల ఎంపిక సర్వే, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం తదితర అంశాలపై గృహనిర్మాణ,పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మొదటి దశలో మంజూరైన 4,437 ఇళ్లలో ఇంకా పనులు ప్రారంభించని 712 మంది లబ్ధిదారులకు అవగాహన కల్పించి పనులు త్వరితగతిన మొదలయ్యేలా చూడాలన్నారు. రెండో దశ కింద గుర్తించిన 4,073 మందిలో ఇప్పటివరకు 2,760 మంది సర్వే పూర్తయిందని, మిగిలిన వారి సర్వేను పారదర్శకంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిధుల వినియోగం, నాణ్యతలో రాజీ పడకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షిస్తూ,నిర్మాణ దశలను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే, జిల్లాలో గుర్తించిన 3,740 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల్లో ఇప్పటివరకు 591 మంజూరయ్యాయని,మిగిలినవి కూడా త్వరగా చేపట్టేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహనిర్మాణ శాఖ పీడీ శ్రీకాంత్, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, అన్ని మండలాల ఎంపీడీఓలు,ఈఈలు,ఏఈలు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే ఎరువుల దుకాణాలు సీజ్:జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరిక




**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి గణపురం**

జిల్లాలో రైతులకు యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని,నిబంధనలు ఉల్లంఘించి అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. మంగళవారం ఆయన గణపురం మండలంలోని పీఏసీఎస్ ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని స్టాక్ బోర్డును పరిశీలించిన కలెక్టర్, రైతులతో ముఖాముఖి మాట్లాడి యూరియా సరఫరా, యాప్ ద్వారా బుకింగ్‌పై అవగాహనను అడిగి తెలుసుకున్నారు. రసాయన యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియాను వినియోగించాలని రైతులకు సూచించారు. అనంతరం, గత ఏడాది ఇదే సమయానికి జరిగిన యూరియా కేటాయింపులు, వినియోగంపై నివేదికలు సమర్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి బాబూరావు, పశుసంవర్ధక శాఖ డీడీ డా.కుమారస్వామి, తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల శిక్షణతోనే ఉత్తమ విద్యాబోధన సాధ్యం:జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

## గణపురం మోడల్ స్కూల్‌లో టీచర్ల శిక్షణా కార్యక్రమం పరిశీలన..

## విద్యాబోధనలో 'ఏఐ' వినియోగం కీలకం





**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి గణపురం**

ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనా సామర్థ్యాలను పెంపొందించుకుని, విద్యార్థులను భావి భారత ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు. మంగళవారం గణపురం మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాటారం,మొగుళ్లపల్లి, మహాముత్తారం, భూపాలపల్లి మండలాల పరిధిలోని జెడ్పీ,కేజీబీవీ, మోడల్,అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల ఎస్జీటీ,స్కూల్ అసిస్టెంట్లకు 'ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్ ఫర్ క్వాలిటీ లెర్నింగ్ టు ట్రాన్స్‌ఫార్మేటివ్ క్లాస్‌రూమ్స్' పేరుతో ఈ శిక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో విద్యాబోధనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం ఎంతో కీలకమైందని పేర్కొన్నారు. 'ఏఐ' ద్వారా బోధనలో నాణ్యత పెరిగి,విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాలు మెరుగవుతాయని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 6 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఏఐ శిక్షణ అందించామని,త్వరలోనే దీనిని మరిన్ని పాఠశాలలకు విస్తరిస్తామని వెల్లడించారు. గుణాత్మక విద్య అనేది కేవలం సామర్థ్యవంతమైన ఉపాధ్యాయుల ద్వారానే సాధ్యమవుతుందనే లక్ష్యంతోనే ఈ సరికొత్త అధ్యాపన విధానాలు,తరగతి నిర్వహణపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు ఈ సృజనాత్మక శిక్షణను సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి,జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) రాజేందర్, మైనారిటీ సంక్షేమ అధికారి డాక్టర్ కుమారస్వామి,జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, ఘన్‌పూర్ తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీఓ భాస్కర్, ఏఎంఓ విజయ్ ప్రకాష్ రెడ్డి, విద్యాశాఖ సిబ్బంది,శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నక్ష రీ సర్వేతో భువివాదాలకు శాశ్వత పరిష్కారం



**యాదగిరిగుట్ట (నల్లగొండ) తెలుగు గళం :** ప్రభుత్వం చేపట్టిన నక్షా రీ సర్వే ద్వారా భూ రికార్డుల్లో పారదర్శకత పెరగడంతో పాటు భవిష్యత్తులో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు... యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లి గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నక్షా సర్వే కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు.. వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, నివాస గృహాలు, ప్లాట్ల వాస్తవ హద్దులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎలా నిర్ధారిస్తున్నారో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... భూ యజమానుల సమక్షంలో హద్దులను గుర్తించి, ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితమైన కొలతలను నమోదు చేయాలని సర్వే సిబ్బందికి సూచించారు. సర్వే సమయంలో భూ యజమానులకు పూర్తి సమాచారం అందిస్తూ, వారి అభ్యంతరాలను పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా నాణ్యతతో, వేగవంతంగా నక్షా సర్వేను పూర్తి చేసి ప్రతి ఆస్తికి ఖచ్చితమైన హద్దులను నిర్ధారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూ అధికారులు, జిల్లా ల్యాండ్ అండ్ సర్వే అధికారి సుజాత, సర్వే బృందాల సిబ్బంది, స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 'కాఫీ విత్ ఏ కాప్'.. సైబర్ భద్రతపై యువ ఉద్యోగులకు అవగాహన



**హైదరాబాద్, జూలై 14 (తెలుగు గళం):**

సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ) సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హెచ్‌ఎస్‌బీసీ (HSBC) క్యాంపస్‌లో 'కాఫీ విత్ ఏ కాప్' 5వ ఎడిషన్‌ను మంగళవారం విజయవంతంగా నిర్వహించారు. "డిజిటల్ డైలమాస్: లెట్స్ నావిగేట్ ఇట్ టుగెదర్" అనే ఇతివృత్తంతో జరిగిన ఈ కార్యక్రమంలో 130 మందికి పైగా హెచ్‌ఎస్‌బీసీ యువ ఉద్యోగులు పాల్గొన్నారు. సైబర్ భద్రత, బాధ్యతాయుతమైన డిజిటల్ ప్రవర్తనపై పోలీసు అధికారులతో ఉద్యోగులు ముఖాముఖిగా మాట్లాడేందుకు, తమ అభిప్రాయాలను పంచుకునేందుకు ఈ కార్యక్రమం ఒక చక్కని వేదికగా నిలిచింది.

సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ డీసీపీ కె. పుష్ప, సైబర్ క్రైమ్ వింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా డీసీపీ పుష్ప మాట్లాడుతూ, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, ఫిషింగ్, డేటా ప్రైవసీ, సోషల్ మీడియా ముప్పులు మరియు తప్పుడు సమాచారం వల్ల కలిగే నష్టాలను ఉదాహరణలతో వివరించారు. లింక్‌లపై క్లిక్ చేసే ముందు లేదా ఆన్‌లైన్ లావాదేవీలు చేసే ముందు ఒక్క క్షణం ఆలోచించి, సరిచూసుకోవాలని (వెరిఫై చేయాలని) సూచించారు. యువతకు "ఆగండి (Pause), సరిచూసుకోండి (Verify), రక్షించుకోండి (Protect)" అనే ముఖ్యమైన సందేశాన్ని ఆమె ఇచ్చారు. ఈ సందర్భంగా డీసీపీ తన వ్యక్తిగత జీవితం, బాధ్యతల గురించి పంచుకోవడంతో ఉద్యోగులు ఆమెతో ఎంతో స్నేహపూర్వకంగా సంభాషించారు.

కార్యక్రమం ప్రారంభంలో ఎస్సీఎస్సీ (SCSC) స్ట్రాటజిక్ ఆపరేషన్స్ డైరెక్టర్ రష్మీ శ్రీవాస్తవ అందరికీ స్వాగతం పలికారు. ఐటీ పరిశ్రమలు, పోలీస్ శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం ద్వారా ఉద్యోగులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే ఎస్సీఎస్సీ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ఈ సెషన్‌లో కేవలం సైబర్ నేరాలే కాకుండా, నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు, శబ్ద కాలుష్యం వంటి పౌర సమస్యలపై కూడా ఉద్యోగులు పోలీసులతో సుదీర్ఘంగా చర్చించారు. సైబర్ నేరాల పరిష్కారంలో సైబరాబాద్ పోలీసులు అందిస్తున్న తక్షణ సహాయాన్ని ఉద్యోగులు అభినందించారు.

ఈ కార్యక్రమంలో హెచ్‌ఎస్‌బీసీ మేనేజింగ్ డైరెక్టర్, ఎస్సీఎస్సీ మహిళా భద్రతా విభాగం జాయింట్ సెక్రటరీ మమతా మదిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. సైబర్ అవగాహన కలిగిన సురక్షితమైన పని వాతావరణాన్ని నిర్మించడంలో హెచ్‌ఎస్‌బీసీ, సైబరాబాద్ పోలీస్, ఎస్సీఎస్సీల ఉమ్మడి నిబద్ధతను ఆమె పునరుద్ఘాటించారు. చివరగా ఉద్యోగుల సందేహాలకు అధికారులు సమాధానాలు ఇవ్వడంతో ఈ అవగాహన సదస్సు ముగిసింది.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.